వేదాంతభేరి

ఫిబ్రవరి 2019

రూ. 10/-



వేదాంతభేరి

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 52 ఫిబ్రవరి 2019 సంచిక : 02

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

వేదాంతభేరి

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 52 ఫిబ్రవరి 2019 సంచిక : 02

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. అక్షరవిద్య -శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. సద్గురు సూక్తులు - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 11
04. అవతార వరిష్ఠుడు - శ్రీ విద్యాస్వరూపానన్దగిరి స్వాములవారు - 13
05. భగవంతుడు -కల్పవృక్షము -శ్రీరామకృష్ణపరమహంస - 14
06. అవిద్యా స్వరూపమ్ - శ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు - 16
07. శ్రీమలయాళస్వామి జీవిత చరిత్ర-సంఘ సంస్కరణ
- డా॥ సముద్రాల లక్ష్మణయ్య -19
08. జ్ఞానసుధ - శ్రీ శంకరానందగిరిస్వాములవారు - 22
09. పైమెట్టు -లోమెట్టు - డా॥ ఆచార్య కె.సర్వోత్తమరావు - 23
10. ఉద్ధవగీత - వై.హెచ్.రామకృష్ణ - 25
11. దినకరుని జయంతి - డా॥ కె.బి.రాజేంద్రప్రసాద్ - 28
12. మంచిని పెంచితేనే మనిషి - డా॥ పులివర్తి కృష్ణమూర్తి - 33
13. శ్రీ మదాంధ్ర మహాభాగవతం-ఆచార్య జక్కంపూడి మునిరత్నం - 34
14. లోకాస్సమస్తాః - సుఖినోభవంతు - జి.ఎన్.కళ్యాణ సుందరం - 37
15. వార్తలు - 42

ముఖచిత్రం - శ్రీరామకృష్ణ పరమహంస

ఫిబ్రవరి 12వ తేది రథసప్తమి

ఫిబ్రవరి 17వ తేది శ్రీరామకృష్ణ పరమహంస జయన్తి

ఫిబ్రవరి 19వ తేది మాఘ పూర్ణిమ - వ్యాసపూర్ణిమ

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

01. ఓం పారాశర్యం పరమపురుషం విశ్వవేదైకయోనిం
విశ్వాధారం విమలయశసం వేదవేదాన్తవేద్యమ్ ।
శశ్వచ్ఛాన్తం శమితవిషయం శుద్ధబుద్ధిం విశాలం
వేదావ్యాసం విమలమతిదం సర్వదా ఽహం నమామి ॥

02. ఓం వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమోవై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥

03. ఓం వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేః పౌత్రమకల్మషమ్ ।
పరాశరాత్మజం వన్దే శుకతాతం తపోనిధిమ్ ॥

04. ఓం వ్యాసాయ యతివర్యాయ విద్యావిగ్రహధారిణే ।
నమస్తే పరమానందదాయినే పరమాత్మనే ॥

05. ఓం బ్రహ్మసూత్రకృతే తస్మై వేదవ్యాసాయ వేధసే ।
జ్ఞానశక్త్యవతారాయ నమో భగవతే హరేః ॥

* * * * * * *

01. ఓం స్థాపకాయ చ ధర్మస్య సర్వధర్మస్వరూపిణే ।
అవతారవరిష్ఠాయ రామకృష్ణాయ తే నమః ॥

02. ఓం హృదయకమలమధ్యే రాజితం నిర్వికల్పం
సదసదఖిలభేదాతీత మేకస్వరూపమ్ ।
ప్రకృతి వికృతి శూన్యం నిత్యమానందమూర్తిం
విమల పరమహంసం రామకృష్ణం భజామః ।

03. ఓం నిరుపమతిసూక్ష్మం నిష్ప్రపంచం నిరీహం
గగనసదృశ మీశం సర్వభూతాధివాసమ్ ।
త్రిగుణరహిత సచ్చిద్బ్రహ్మరూపం వరేణ్యం
విమల పరమహంసం రామకృష్ణం భజామః ।



అక్షరవిద్య

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సామాన్యముగ పిల్లలకు దాదాపు ఐదు సంవత్సరముల వయస్సు పూర్తి కాగానే తల్లిదండ్రులు వారి విద్యాభ్యాస విషయమై యోచింపమొదలిడుదురు. వారికి అక్షరాభ్యాసము గావించుదురు. **అక్షర మనగా నాశరహితమైనది. క్షర మనగా నశించునది.** ప్రపంచములో దృశ్యమానమగు ప్రతి పదార్థమున్ను క్షయశీలమైనది. చావు పుట్టుకలు కలది, తుట్టతుదకు అతిసూక్ష్మములైన మనో బుద్ధి చిత్తాహంకారములు కూడ ఒకానొక సమయమున నశించిపోవునవియే అయి యున్నవి. కాని ఆత్మ (బ్రహ్మము) మాత్రము ఏ కాలమందును నశింపదు. అది అక్షరమైనది. అట్టి ఆత్మను గూర్చి తెలిసికొనుటయే వాస్తవమగు అక్షరాభ్యాసమగును. అదియే **అక్షరవిద్య.** దీనిని గూర్చియే శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత ఎనిమిదవ అధ్యాయమందు ప్రస్తావించెను. మఱియు రాజవిద్య యనియు వేఱొక సందర్భమున దానికి నామకరణ మొసంగెను. ఏది సర్వ విద్యలకును మకుటప్రాయమై యున్నదో, అది **రాజవిద్య,** బ్రహ్మవిద్య. రాజును విడిచి సామాన్యుని ఆశ్రయించుట యెట్టిదో రాజవిద్యను విడిచి ఇతర విద్యల నాశ్రయించుటయు అట్టిదేయగును. బ్రహ్మ విద్యకు 'రాజత్వ' మాపాదించి శ్రీకృష్ణుడేల అద్దానికి ప్రాధాన్యత నొసంగెనో విజ్ఞు లొకింత యోచింపవలెను. ఏది దుఃఖమును ఆత్యంతికముగ నివారించునో, ఎద్దానియందు నిలుకడ గల్గినచో భీషణతాపములు, క్లేశములు కూడ మనుజుని చిత్తమును వ్యాకుల మొనర్పజాలవో, ఏది జీవితకాలముననే పరమానందము నొసంగగల్గునో, అట్టి అధ్యాత్మవిద్యను, బ్రహ్మవిద్యను,

అక్షరవిద్యను ఉపేక్షించిన కారణమువలననే జనులు తక్కిన ఎన్ని విద్యలున్నప్పటికిని దుఃఖమును దాటలేకున్నారు.

నదీప్రవాహ మధ్యమున కావలసిన విద్యయేది? ఏ విద్య అత్తతి జీవున కుపయోగించును? 'ఈత' విద్య, ఆ విపత్కర సమయమున తర్కము గాని, మీమాంసగాని, జ్యోతిషముగాని, హిస్టరీగాని, జాగ్రఫీగాని, ఆల్జీబ్రాగాని, జ్యామెట్రీగాని, మఱేదిగాని జీవుని రక్షింపజాలదు. మునుగువానికి ఈత విద్య యొక్కటియే శరణ్యము. అట్లే జీవుడు సంసార సాగర మధ్యమున గ్రుంకులిడుచున్నాడు. జనన మరణ ప్రవాహమున బడి నానాదుఃఖముల ననుభవించుచున్నాడు. అట్టివానికి తరణోపాయము బ్రహ్మవిద్యయే. అక్షర పరమాత్మతత్త్వమే. ఆ విద్యయొక్కటియే జీవుని తరింపజేయగలదు. కనుకనే దానికి తారక విద్యయను పేరు గలిగినది. భయదుఃఖ శమనమునకై, దుఃఖరాహిత్యమునకై మనుజుడద్దానిని తప్పక పరిగ్రహించవలయును. శాశ్వతానందమునకు మార్గమును యోచించు కొనువాడే ధన్యుడు. అద్దానిని నోచుకొనలేని జీవితము జీవితము కాదు.

కాబట్టి ఎంతటి గొప్ప పండితులైనను, కవిశేఖరులైనను, విద్యా వాచస్పతులైనను, శాంతికై, దుఃఖరాహిత్యమునకై, అక్షర (బ్రహ్మ) విద్యను నేర్వవలసినదే. చతుష్షష్టి కళలందు, విద్యలందు ప్రావీణ్యము సంపాదించినను, తిరిగి పలక, బలపము తెచ్చుకొని ఆధ్యాత్మరంగమున అక్షరాభ్యాసమును ప్రారంభించవలసినదే. శమదమాదులను, కరుణ, దయ పరోపకారము, భగవద్భక్తి, వైరాగ్యము మున్నగు పరమార్థ గుణములను అభ్యసించవలసినదే. అక్షర బ్రహ్మతత్త్వము పూర్తి అయినట్లు లేనిచో ఎన్ని లౌకిక విద్యలు సముపార్జించినప్పటికిని, జనులు 'ఒ, న, మా'లు రాని వారే యగుదురు.

షడంగాది వేదో ముఖే శాస్త్ర విద్యాః

కవిత్వాది గద్యం సు పద్యం కరోతి

హరేరంఘ్రి పద్మే మనశ్చేన్న లగ్నం

తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్.

"వేదములను సాంగోపాంగముగ చదివినప్పటికిని, సమస్త విద్యలయందును ఆరితేరినప్పటికిని, అనర్గళముగ కవిత్వము చెప్పగలిగి యున్నప్పటికిని, భగవంతుని పాదపద్మములందు మనస్సు సంలగ్నము కానిచో, వానివలన మనుజునకేమి ప్రయోజనము?" అని శ్రీ శంకర భగవత్పాదాచార్యులవారు ఉద్ఘోషించియున్నారు.

ఏది చావును తప్పించగలదో అదియే నిజమగు విద్య. ఏది బంధమునుండి విడిపించగలదో అదియే నిజమగు శాస్త్రము. తక్కినవి యన్నియు 'భుక్తయే న తు ముక్తయే'అనునట్లు భుక్తిమార్గమును చూచుకొన గూడదని కాదు. ముక్తిమార్గమునుగూడ మఱువరాదని చెప్పుటయే యగును. అన్ని సంపదలు, అన్ని విద్యలు ఉండియు, తన ఆత్మను తాను తెలిసికొనినచో, అక్షర పరబ్రహ్మమును గూర్చిన పరిచయము లేనిచో అవి యన్నియు శవాలంకార సదృశములుగనే యుండును. ప్రాణము లేని శవమును ఎంత అలంకరించిననేమి ప్రయోజనము?

ఒక సుందరమైన కార్డు ఉన్నదనుకొనుడు, దాని చుట్టును అనేక నగిషీలు, కత్తిరింపులు, తళుకుబెళుకులు చేయబడినవని ఊహింపుడు, కాని స్టాంపు (బిళ్ళ) అతికించకుండ దానిని పోస్టులో వేసినచో గమ్య స్థానమును చేరునా? చేరదు. అతిసామాన్యమైన కార్డు అయినను, స్టాంపుబిళ్ల అతికించినచో ఎన్ని వేల మైళ్లైనను ప్రయాణము సాగించ గలదు. అట్లే ప్రాపంచిక చదువు సంధ్యలు లేకపోయినను, పవిత్రత, హృదయనైర్మల్యము, బ్రహ్మానుభూతి గలిగియున్నచో ప్రపంచమున

కంతకును అతడు వెలుగును ప్రసాదించగలడు. తాను తరించి ఇతరులను తరింపజేయగలడు. శాంతిసుఖములను ఈ జీవితమునందే యనుభవింపగలడు.

నిరక్షరస్యాపి తు యస్య కుక్షౌ
బ్రహ్మైవ చాభాతి స ఏవ సాక్షరః
సర్వాక్షరస్యాపి తు యస్య చిత్తే
బ్రహ్మైవ నాభాతి స వై నిరక్షరః

'విద్యాగంధము లేకున్నను, ఎవని హృదయమున బ్రహ్మము భాసించుచుండునో, ఎవడు బ్రహ్మానుభూతి గలిగియుండునో, అతడు సర్వవిద్యాపారంగతుడే యగును. అన్ని విద్యలు తెలిసికొనియున్నను ఎవని చిత్తమందు బ్రహ్మము భాసింపకుండునో అతడు అక్షర శూన్యుడే యగును–' అని తాత్పర్యము. ఇంతమాత్రముచేత లౌకిక విద్యలను చిన్నచూపు చూచిరని యెవరును భావింపరాదు. సంసారతరణ హేతువగు బ్రహ్మవిద్యనుగూడ వానితోబాటు కలిగియుండుడని ప్రబోధించుటయే యగును. మఱియు రెండింటిలో ఏదియో ఒకటిమాత్రము ఏరుకొనవలసిన పరిస్థితి వచ్చినచో 'జరామరణ విమోచనకర'మగు ఈ పరమాత్మ విద్యనే ఎన్నుకొనవలసి యుండును.

ఏలయనగా, జన్మించిన ప్రతివానియొక్క ప్రథమ కర్తవ్యము మఱల జన్మింపకుండుటకు వలసిన సాధన సామగ్రిని సంపాదించుటయే యగును. దానిని ముందు సంపాదించి అటుపిదప తక్కిన వానినిగూర్చి యోచింపవచ్చును. మహాత్ములనుసరించు పద్ధతి యిదియే. అట్లుకాక జీవితమంతయు చతుష్షష్టి కళల సముపార్జనయందు ముందుగ

వినియోగించినచో ఆకస్మాత్తుగ మృత్యువాసన్నమైనచో అపుడు మనుజుడేమి చేయగలడు? ఆ విద్యలు వానిని అంత్యకాలమున రక్షించునా? లేక యమబాధలను అవి తప్పించగలవా? లేదు. అట్టి శక్తి ఒక్క బ్రహ్మవిద్యకు మాత్రమే కలదు. కావున అక్షర పరబ్రహ్మమునుగూర్చి, నిజాత్మ తత్త్వమును గూర్చి యెఱుఁగుటకై సత్వరము కృషి సలుప వలయును.

అట్టి బ్రహ్మవిద్యను సంపాదించు వ్యక్తి తాను ఏ కాలమందును భూతాకాశముగాని, చిత్తాకాశముగాని కాదనియు, అతి సూక్ష్మమై, నామరూపరహితమైనట్టి చిదాకాశమే యనియు చక్కగ గుర్తెఱుఁగును.

"త్రినేత్ర వైద్యాలయ ట్రస్టుకు (కంటి ఆసుపత్రి)
ఈక్రిందివారుపైకం పంపినారు

1). శ్రీజి.గిరిధర్‌గారు (బెంగుళూరు) రూ. 1,00,000/-
2). శ్రీమతి ఈశ్వరవాక లీలావతిగారు (రాచకండ్రిగ)
(కీ॥శే॥ సుబ్రహ్మణ్యం రెడ్డి గారి భార్యగారు) రూ.49,000/-

సద్గురు సర్వ సేవా ట్రస్టుకు ఈక్రిందివారు పైకం పంపినారు

శ్రీ పొట్టపర్తి నాగభూషణం గారు (నందిపేట)
(తల్లిదండ్రుల పేరిట అన్నదానానికి నిధి) రూ.10,000/-

వేదాన్తభేరి పోషక చందా ఈ క్రింది వారు పంపినారు

(1). ఇ.రెడ్డి బాబుగారు (కదిరి, అనంతపురం జిల్లా) రూ.1601/-
(2). బి.భాగ్యలక్ష్మి గారు (కొండాపూర్, హైద్రాబాద్) రూ.1500/-
(3). ఎస్.వి.ఎన్.రాజుగారు (తిరుపతి) రూ.1500/-
(4). ఎస్.నరసింహులు గారు (కర్నూలు) రూ.1500/-
(5). జి.వెంకటేశ్వర్లు గారు (పాలవల్లి) రూ.2000/-

సద్గురు సూక్తులు

– శ్రీ సద్గురు మహర్షి మలయాళస్వాములవారు

1. వాఙ్నియమము మహాపురుషుల లక్షణమై యుండును. కాకులు అరచునట్లు హంసలు అరువవుగదా?

2. సాముగరడీల ద్వారా కండరములను పెంచినవాడు బలవంతుడు గాడు. సాధనానుష్ఠానముల ద్వారా మనోజయమును సాధించినవాడే నిజమైన బలవంతుడు. మనోజయము లేనివాడెంత సింహబలుడైనను నిజమునకు దుర్బలుడే.

3. అరణ్యమున సింహగర్జన (విన్న) జంతువులెట్లు పారిపోవునో ఓం తత్ సత్ అను ఉచ్చారణ ఆత్మ (లేక దైవ) భావనతో జేసిన హృదయారణ్యములోని పాపవృత్తులను మృగములు పారిపోవును.

4. ఇనుమును కొలిమిలో పెట్టినను తిత్తులతో ఊదనిచో నెటుల కరుగదో, అటులనే తీవ్ర వైరాగ్యముచే యేకాంతమున తపస్సు చేయుచుండినను తత్త్వబోధ లేనిచో హృదయగ్రంథి విచ్ఛేదము గల్గి సమరస జ్ఞానము గలుగదు.

5. ఆహారశుద్ధి, వస్త్రశుద్ధి, నివాస శుద్ధి, సంసర్గశుద్ధి, వాక్శుద్ధి, క్రియాశుద్ధి, ధ్యానశుద్ధి, సంకల్పశుద్ధి అను ఎనిమిది శుద్ధులు ఆత్మశుద్ధికి కారణములని మరువకుడు.

6. తన ప్రకృతి ఎంతకెంతకు వశపడునో అంతకంతకు

ఆ మహాపురుషునకు ప్రపంచము వశమగును. ఈ సత్యముతెలియనివారు మహాపురుషుల కేదో ధనాకర్షణ, జనాకర్షణ మంత్రము లుండునని తలంతురు. నిజమునకు వారికాస్థితి మనస్సును స్వాధీనము చేసుకొనుటలో గలిగినదేకాని మంత్ర తంత్రములతో గాదు.

7. ఎవడు మహాత్ములకు భక్తి, వినయ నమ్రతలతో వంగి నమస్కరింపడో వానికి విశ్వ ప్రయత్నము చేసినను ప్రకృతి వంగదు (వశము కాదు).

8. దేహేంద్రియములు నశించినను ఆత్మకు నాశము లేదని తెలుసుకొని నిజానందముతో సదా వుండుటయే సనాతన ధర్మమని యెరుగవలయును.

9. వస్త్ర నిర్మాణమునకు పడుగుపేకలు సమానముగా నుండుటెంత అవసరమో పరమాత్మను దర్శింపదలచినవానికి యోగసాధన, జ్ఞాననిష్ఠలు అంత సమానముగా నుండవలయును. అట్లు లేనిచో పరిపూర్ణస్థితిని పొందజాలడు.

10. స్థూలదేహారోగ్యము కొఱకు ఆయుర్వేదము, సూక్ష్మదేహారోగ్యము కొఱకు జ్ఞానయోగము చెప్పబడినవి. ఈ రెండును వైద్యములే యగుచున్నవి. అయితే ఈ రెంటికిని పథ్యము తప్పక యుండవలయును.

9వ భాగవత సదస్సు

శ్రీకాళహస్తి శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరుగుచున్న భాగవత సదస్సులలో **9వ భాగవత సదస్సు 13-02-2019వ** తేది నుండి **19-02-2019** తేది వరకు జరుగనున్నది. ఈ సదస్సులో **పూజ్యశ్రీ శ్రీమాతాజ్యోతిర్మయానంద భారతిస్వామిని వారు నవమ స్కంధంపై ప్రవచన చేస్తారు. అందరికీ ఆహ్వానము. రండి. వినండి !**

అవతార వరిష్ఠుడు

– శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

శ్రీరామకృష్ణ పరమహంస ఈ యుగంలో ఒక అవతార శ్రేష్ఠుడు. మనందరి జన్మలకు మన కర్మలు కారణమైతే, శ్రీగురుమహరాజ్ జన్మకు కర్మ కారణం కాదు. వారికి ఏ కర్మలు లేవు. వారు కారణ జన్ములు. మనందరి సమష్టి పుణ్యకర్మ మన ఉద్ధరణ కోసరం వారికి జన్మనిచ్చింది.

"ఆత్మనో మోక్షాయ జగద్హితాయచ"అను శ్రీరామకృష్ణమఠ, మిషనుల ఉద్దేశ్యాన్ని, లక్ష్యాన్ని గురుమహరాజ్ శిష్యుడు స్వామి వివేకానంద నిర్ణయించిన ప్రకారము తాను వెనుక నుండి వివేకానందాదుల ద్వారా జరిపించుటకు అవతరించిన పురుషుడు శ్రీరామకృష్ణపరమహంస వారు కకారమాయకు అతీతులు. గురుమహరాజ్ శ్రీ పరమహంస మనలాగా లోకంలో వున్నా లోకవాసనల కతీతుడు.వారు సదా చిదంబర విహారం చేస్తూవుండేవారు.

శ్రీ స్వామి వివేకానందులకు "ఎవడు శ్రీరాముడో యెవడు శ్రీకృష్ణుడో అతడే ఈ రామకృష్ణుడు" అని స్వయంగా తెలిపిన అవతార పురుషుడు శ్రీరామకృష్ణ పరమహంస. పూజ్య శ్రీరామకృష్ణానందస్వాములవారు (శ్రీ భూమానందాశ్రమం, గండిక్షేత్రం, కడపజిల్లా) అన్నట్లు – శ్రీరామునిలోని ధర్మం, సంయమం, శ్రీకృష్ణునిలోని నిర్మోహత్వం, నిర్మలాత్మజ్ఞానం శ్రీరామకృష్ణ పరమహంసలో మేళవించాయి. కాబట్టే వారు అవతార వరిష్ఠులనబడ్డారు. కె.వి. పుట్టప్ప (కర్నాటక) – " శ్రీరామకృష్ణ పరమహంస సాక్షాత్ పరబ్రహ్మ, ప్రాచీనయుగ ధర్మ ప్రవర్తక సంఘంయొక్క ఆధునిక సంస్కార ప్రకాశమే శ్రీరామకృష్ణ పరమహంస" అనడం ఎంతేని సమంజసంగా వుంది.

"మేము పుస్తక శోధన కాదు, మస్తక శోధన చేస్తాం" అని శ్రీ సిద్ధారూఢస్వామి (హుబ్లీ) వారన్నట్లు గురుమహరాజ్ భగవంతుణ్ణి పుస్తకాలల్లో వెదుకలేదు. హృదయంలో వెదికారు. నిర్వాసనా వాసితులై సాక్షాత్ వాసుదేవులే అయినారు. లోకంలో ఉంటూ లోకాతీతుడై "ఆహారం తీసుకొనేట్లు అమ్మను కోరమంటే" అందరినోళ్లు నా నోళ్లే గదా ! అని పలికి సర్వాత్మభావాన్ని ఆచరణలో నిరూపించిన మహానుభావుడు ఆయన. అట్టి అవతార వరిష్ఠుడు శ్రీరామకృష్ణునికి ప్రణామాలు.

భగవంతుడు - కల్పవృక్షము

– శ్రీరామకృష్ణ పరమహంస

ఒక బాటసారి గ్రామాంతరమునకు పోవుచూ దారిలో ఒక మైదానమును జేరుకొనెను. ఎండలో నడచుచున్నందున అతనికి ముచ్చెమటలు పట్టెను. విశ్రమించనిదే నడువలేని స్థితి వచ్చెను. గావున అటునిటు జూడగా సమీపంలో ఒక చెట్టుయుండెను. అంత నాతడు ఆ చెట్టుక్రింద గూర్చొండెను. ఎండతాపము నుండి చెట్టు నీడను జేరుటచే అతనికి హాయిగా నుండెను. అంత గొంతసేపటికి అతడు నిదురించుటకు తనకు ఒక పాన్పు చిక్కిన ఎంత బాగుండును అని వూహించ నారంభించెను. అతను గూర్చున్నది కల్పవృక్షము క్రింద. కాని అతనికా విషయము తెలియనే తెలియదు. పైరీతిగా కోరిక అతని మనస్సులో తోపగనే తన ప్రక్కన చక్కని పాన్పు గనింపించెను. దానిని చూచి అతడమితాశ్చర్యము నొంది దానిపై పరుండెను. మరికొంతసేపటికి పరుపు బాగుంది. ఇపుడొక అందమైన స్త్రీ ప్రక్కన యుండి నా కాళ్లు పట్టుచుండిన (ఒత్తుచుండిన) హాయిగా వుండును గదా! అనుకొనెను. ఈ తలంపు గలుగగానే ఒక సుందరి వచ్చి తన పాదముల నొత్త నారంభించెను. అది గనిన ఆ బాటసారి పరమానందభరితుడాయెను. ఇంతలో నాతనికి ఆకలి ఆయెను. అంత నాతడు "నేను కోరినదంతా వచ్చినదే! ఈ ఆహారం గూడా లభిస్తే ఎంత బాగుండును" అనుకొనెను. అతడట్లు వూహించీ వూహించకముందే అతని ఎదుట షడ్రసోపేతంతో గూడిన పలురకాల పదార్థాలు గల భోజనము సిద్ధమాయెను. వెంటనే అతడు దానిని తృప్తిగ దిని పరుపుపై పండుకొనెను.

ఇపుడతను జరిగినదానినంతటిని యోచించ దొడగెను. ఈ యోచనలలో "ఇది మాయా, లేక నిజమా? ఒకవేళ ఇపుడు ఒక పులి వచ్చి నన్ను మింగితే ఎట్లు?" అని తలంచెను. అంతే అతని మనస్సులో ఈ యోచన రాగానే నిజముగా ఎదుట పులి గాండ్రుమంటూ అతనిపై బడి అతనిని చంపివేసెను. సాధారణముగా లోకులగతి ఇట్టిదే.

భగవంతుడు కల్పతరువు వంటివాడు. మనమేమి కోరిన దానిని భగవంతుడు నొసంగును. కీర్తిగౌరవముల నపేక్షించి భగవంతుని ప్రార్థించిన అవే మీకు సిద్ధించును. కానీ వాని వెనుకనే రోగము, శోకము, ధనహాని, మానహాని మొదలగు భయంకర పెద్దపులులు దాగియున్నవని మఱువకుడు. కావున పారమార్థిక సాధకుడు ఐహిక వాంఛలనన్నింటిని వదలి జాగరూకుడై కేవలం దైవసాక్షాత్కారాన్నే కోరవలెను.

నారాయణ కవచం

జీవితంలో అకస్మాత్తుగా శత్రుబాధ కలిగినప్పుడు దాని నివారణకు నారాయణ కవచం పారాయణ చేయాలి.

ఈక్రింది సందర్భాలలో నారాయణ కవచ పారాయణ సత్ఫలితాలనిస్తుంది.

1). శత్రు నిరోధము. **2).** అనారోగ్యము, **3).** ఆర్థిక ఇబ్బందితో పరువు ప్రతిష్ఠలు పోవునపుడు. **4).** త్వరగా సాధించాల్సిన పనికి ఆలస్యం, విఘ్నం కలిగినపుడు. 5). తనపై ఇతరులు దుష్టమంత్రాన్ని ప్రయోగించినపుడు.

ఓం నమో నారాయణాయ అనే అష్టాక్షరి మంత్రాన్ని శరీరంలోని ఎనిమిది ఆయువు పట్టులందు ధరించాలి.

2. విష్ణు షడక్షరి మంత్రాన్ని (ఓం విష్ణవే నమః) శరీరంలోని ఆరు అంగాలందు న్యాసం చేయాలి. **- శుభవార్త పత్రిక సౌజన్యంతో.**

భగవంతుని దయగలిగితే ఇతరులు చేసే అపకారాలు మనకు ఉపకారాలుగా పరిణమిస్తాయి.

అవిద్యా స్వరూపమ్

- శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

న విద్య అవిద్య, విద్య=జ్ఞానము, విద్‌జ్ఞానే ధాతువు నుండి వృత్పత్తి. అవిద్య = అజ్ఞానము. వస్తువు యొక్క [illegible] గా గుర్తించుటయే అవిద్యయనబడును. ఉదాహరణకు జామ పండును చూసి నిమ్మపండుగా తెలిసికొనుట, 3ను చూసి 6 అనుకొనుట, త్రాటిని జూసి సర్పమనుకొనుట, సర్పమును జూసి త్రాడనుకొనుట. ఈ విధమైన భ్రమాత్మకమే అవిద్య.

ఎవరు బ్రాహ్మణుడు?
మూలం
బుద్ధుని ధర్మపదం
అనువాదం
- బ్రహ్మచారి ఆనందమోహన్

యోగ దర్శనములో పతంజలి మహర్షి అవిద్యకొక లక్షణము చెప్పియున్నారు.

సూ ॥ 2-5 అనిత్యాశుచి దుఃఖానాత్మసు

నిత్యశుచి సుఖాత్మ ఖ్యాతి రవిద్యా ॥

అనిత్య వస్తువునందు నిత్యమని, అశుచియందు పరిశు భ్రమనియు, దుఃఖకరమగు వస్తువును సుఖమనియు, అనాత్మయందు ఆత్మబుద్ధియును అవిద్యయందురు.

'యజ్జన్యం తన్నశ్యం' దేనికి ఉత్పత్తియున్నదో అది నశించును. మన దృష్టిలో పంచభూతములైన భూమి, జలము, అగ్ని, వాయు, ఆకాశమును, మరియు సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు ఇవన్నియు నిత్యమని, శాశ్వతములుగాయుండువారని భావించి ఉపాసనలు చేస్తున్నాము. కాని ప్రళయ కాలములో వీరందురూ నశించువారే. అనిత్యమైన వీరి వుపాధులయందు నిత్యత్వ బుద్ధి గలిగి యుండుటయే అవిద్య. స్వర్గాది లోకములు, ఇంద్రాది పదవులు అనిత్యములు.

వీటియందు నిత్యత్వ బుద్ధి నుంచి సోమాది యాగములు చేయుట, ఆ లోకములు సత్యములని తలంచుటయే అవిద్య.

అశుచియగు శరీరమునందు శుచిగలది యనుభావించుటయే అవిద్య. "స్థానాత్బీజాదుపష్టంభాన్నిష్యందాన్నిధనాదపి కాయమధేయ శౌచత్వాత్పండిహ్యాశుచిం విదుః॥ అశుచియగు శరీర స్వరూపమును దెలుపుచున్నారు. తల్లి గర్భ కోశమే శరీరమునకు ఉత్పత్తిస్థానము. శుక్ల శోణితములే ఉపాదాన కారణము. భోజన పానాదుల పరిపాకమువలన, రక్తాది సప్తధాతువులయొక్క బలముగలిగియున్న శరీరం, మరియు మలమూత్రాదులను, స్వేదాదులను కార్చుచుండును. స్నానాదులొనర్పకున్న దుర్గంధ యుక్తమైనదియు, పరమ బీభత్సమైనది, వాతపిత్త కఫముల యొక్క పరిణామములతో వ్యాధిగ్రస్తమైనదీ శరీరము. దీనియందు శుచియను బుద్ధియే అవిద్య. ఈ శరీరమును పోషించుకొనుటయే ముఖ్య కర్తవ్యమని, శరీరమునందు నిత్యత్వ బుద్ధి నుంచినవారు పశుతుల్యులగుదురు. శరీరమనే నావద్వారా సంసారసాగరమును దాటవలెను. కనుక శరీరమును సరంక్షించుకోవలెను. దీన్నియుద్దేశించి 'శరీరమాద్యంఖలు ధర్మసాధనమ్ ' అన్నారు పెద్దలు, శాస్త్రము.

విషయ భోగరూప దుఃఖమునందు సుఖమను బుద్ధియు అవిద్యయే. "సుఖమల్పం బహుక్లేశో విషయ గ్రాహిణాం నృణాం। అనంతం బ్రహ్మనిష్ఠా నామితి వేదాన్తడిండిమః॥

ఇంద్రియముల ద్వారా అనుభవించు శబ్ద స్పర్శరూప రస గంధాదులనే విషయములు అనుభవ కాలంలో గూడ స్వల్ప సుఖాదులను యిచ్చి పరిణామంలో దుఃఖమును గలుగజేయును. కనుక దుఃఖమునందు సుఖ బుద్ధి అవిద్యయని సూత్రకారులు చెప్పిరి. అనుభవించిన విషయములు సంస్కార రూపంలో అంతఃకరణ మందుండి అపుడపుడు సదృశవస్తులను

చూచినపుడు జ్ఞాపకం గలుగుచుండును. దీనినే స్మృతి యందురు 'అనుభవ జన్యజ్ఞానం సంస్కారః సంస్కార జన్యజ్ఞానం స్మృతిః " అందురు. ఆ స్మృతి గలిగినపుడు ఇంద్రియములుండి విషయములు ప్రాప్తంకానపుడు అనంతమైన దుఃఖమే. విషయములుండి ఇంద్రియములు నష్టమైనను దుఃఖమే కలుగును. ఇందుచే సుఖమల్పం బహుక్లేశమన్నారు. విషయ విచారణ, ప్రకృతి విచారణ, పరమార్ధ విచారణ మానవుడు ముఖ్యముగా చేయవలసి యున్నది. విషయములయందు దోష దృష్టిని ఆరోపించి, పరమార్ధ విషయమునందాసక్తి గలిగి యుండుట చేతనే అనంత సుఖము గలుగును.

ఆత్మ భిన్నములగు వస్తువులందాత్మబుద్ధి గలిగియుండుటయి అవిద్యయే. జడములగు శరీరములందు, శ్రోత్రాది జ్ఞానేంద్రియముల యందు, వాగాది కర్మేంద్రియములందు, ప్రాణాపానాది పంచప్రాణముల యందు అంతఃకరణ చతుష్టయములగు మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము, ఈ మొదలగు వాటియందు చేతన స్వరూపమగు ఆత్మయని బుద్ధియుంచి భావించుటయే అవిద్యయనబడును. ఇవి ఎపుడూ అనాత్మలేగాని ఆత్మలు కావు. వీటియొక్క యథార్థమును విచారింపక వీటియందు ఆత్మభావన చేసి అనేక కల్పములు ఆయా స్వరూపములను బొంది, అవధి దాటగానే మరల మానవ లోకమునకు వచ్చుచున్నారు. కావున బాగుగా విచారణ జేసి దేహాది సంఘాతమునకు సాక్షియైన వాడు సర్వజ్ఞుడైన వాడే పరమాత్మయని భావించి, శ్రోత్రియ బ్రహ్మ నిష్ఠుల నాశ్రయించి, తత్వమసి మహావాక్యము శ్రవణం జేసి అహం బ్రహ్మాస్మియని, నేనే ఆ పరబ్రహ్మమును యని భావించవలెను. "అవిద్యా నాశో మోక్షః" అవిద్య నాశమే మోక్షమన్నది శాస్త్రం. అవిద్యను పోగొట్టుకొనిన వారి జీవితమే ఆనందమయము.

ఓం లోకాస్సమస్తా సుఖినో భవన్తు ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః.

శ్రీ మలయాళస్వామి జీవిత విశేషాలు - 17
సంఘ సంస్కరణ

- డా।। సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

స్వామి గోగర్భంలో ఉన్నప్పుడే అక్కడ యాచనతో జీవించే బాలురపట్ల జాలిచూపారు. వారి దుఃస్థితి జూచి పరితపించి వారిని సంస్కరించి వారిజీవితాలను సరిఅయిన త్రోవలో నడిపించాలను కొన్నారు.

నాటి దేవస్థానం అధికారి రామలఖన్ బావాజీ, పారుపత్తెదారు లక్ష్మీనరసింహారావు గార్ల సహకారంతో వెయ్యి కాళ్ళ మండపంలో రాత్రి పాఠశాల ఏర్పాటు చేశారు. అక్కడ ఇద్దరు అధ్యాపకులను నియమింప జేసి ఆ బాలురు చదువుకొనే వీలుకల్పించారు. పాఠశాలలో మొత్తం 43 మంది చేరారు. దేవాలయ ప్రసాదం నుండి వారికి భోజనం ఏర్పాటు చేయడమయింది. **ఈ క్రింది నిబంధనలు విద్యార్థులకు విధింపబడ్డాయి.**

1). పాఠశాలకు సమయానికి రావాలి. **2).** పరిశుభ్రత పాటించాలి. **3).** ఏ దినం నేర్పిన పాఠాలు ఆ దినమే వల్లించాలి. **4).** బీడి, భంగి వగైరా వాడరాదు.

పిల్లలకు పలకలు, పుస్తకాలు, వస్త్రాలు ఉచితంగా ఇచ్చేటట్లు ఏర్పాటయింది. అయినా పై నిబంధనలు పాటించలేకపోవడం వల్ల ఆ పిల్లల చదువు కొనసాగలేదు.

ఆపైన గోగర్భంలోనే స్వామి స్వయంగా నలుగురు బాలురకు పాఠాలు చెప్పడం ప్రారంభించారు. పై నియమాలు వీరికిగూడ అనువర్తింప జేశారు. కాని వారుగూడ నియమ పాలన చేయలేక చదువుకు దూరమయ్యారు.

1926లో వ్యాసాశ్రమం స్థాపించబడిన తరువాత శ్రీవారి సంస్కరణోద్యమం సఫలమయింది. 1928లో ఆశ్రమంలో సంస్కృత పాఠశాల ప్రారంభమయింది.

బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులు అనే భేదం లేకుండా అందరూ సమభావంతో సంస్కృతం మున్నగు భాషలు అభ్యసించే అవకాశం అందులో కల్పింపబడింది. అన్ని ప్రాంతాలనుండీ వేలకొలది బాలబాలికలు ఆశ్రమంలో చేరి విద్యాభ్యాసం చేసి గురుకుల నివాసఫలం పొందారు.

ఆపై కొన్ని దినాలకు బాలికలకు ప్రత్యేకంగా కన్యాగురుకులం స్థాపించబడింది. బ్రహ్మవిద్యాజిజ్ఞాస కలవారికొరకై బ్రహ్మవిద్యా పాఠశాలను గూడా నెలకొల్పారు.

స్వామి చేసిన ప్రయత్నం పైకి బ్రహ్మ విద్యా ప్రచారపరమే అయినా అందులో సమాజ సంస్కరణ అంతర్లీనమై యుండేది. స్త్రీ విద్యాభివృద్ధిని కోరి కన్యాగురుకులం ఏర్పాటు చేయడమయింది. కుల వర్ణలింగ భేదం పాటించకుండా అందరికీ సంస్కృతం, గీత, ఉపనిషత్తులు బోధించే వ్యవస్థ రూపుదిద్దుకొన్నది. శ్రీ నారాయణ గురుదేవులెలా సంఘ సంస్కరణకు పాటుపడినారో, అట్లే శ్రీ స్వాములవారు గూడా శ్రమించారు.

సంఘంలో అందరూ విద్యావంతులై యుండాలి. లేకుంటే ఏ కొందరో విద్యావంతులైతే వారు విద్య విహీనులను తక్కువతనంతో చూచి వారిని వంచనకు గురి చేస్తారు.

కులభేదం కారణంగా అంటరానితనం మున్నగు దురాచారాలు ఆనాడు సమాజంలో ప్రబలంగా ఉండేవి. వాటిని స్వామి సహించేవారు కారు. మనుస్మృతి వంటి గ్రంథాలలో సంఘంలో కొందరికి ఆత్మోన్నతికి అవకాశం లేకుండా చేసే శాస్త్రవచనాలు ప్రవేశించాయి. అవి మనువు చెప్పినవి కావు, ప్రక్షిప్తవచనాలని స్వామి అభిప్రాయం. ఆర్య సామాజికుల

అభిప్రాయం గూడా అదే.

శ్రీభగవద్రామానుజులు కులభేదాలను నిరసించారు. కాని తదను యాయులు ఆ ధర్మాన్ని పాటించినట్లు కనిపించదు. ఈ భేదాలు భారత జాతిని నిర్వీర్యం చేశాయి.

జనుల అభివృద్ధి నరికట్టే కల్పిత గ్రంథాలను స్వామి నిశితంగా ఖండించారు. శ్రీమలయాళ యతీంద్ర గీతలో స్త్రీ విద్య, జాతిభేదం, యుగభేదం – మున్నగు విషయాలను నిరూపించే అధ్యాయాలలో సంస్కరణ విధానాన్ని తేటతెల్లం చేశారు.

శ్రీవారు రచించిన 'లోకోద్ధారకము' అను గ్రంథం అభ్యుదయ వాదులందరూ తప్పక చదువవలసినది. అందులో వర్ణవ్యవస్థ వల్ల జాతికి కల్గిన హాని ఎట్టిదో చక్కగా వివరించారు. తత్త్వవేత్తలు సమాజ సంస్కరణకు పాటుపడతారు. అందుకు స్వామి చక్కని నిదర్శనం.

– శ్రీ మాతా గుర్వుచరణానన

6 విధాలైన శరణాగతి

ఆనుకూలస్య సంకల్పః, ప్రతికూలస్య వర్జనం

రక్షిష్యతీతి విశ్వాసః, గోప్తృత్వ వరణం తథా

ఆత్మనిక్షేపకార్పణ్యౌ షడ్విధాః శరణాగతిః ॥ (భాగవతం)

1. అనుకూల సంకల్పాలను కలిగియుండుట.
2. ప్రతికూలాలను తలంచక వుండడము.
3. రక్షిస్తాడనే బలమైన నమ్మకము.
4. స్థిర బుద్ధి (గోప్తృత్వ వరణం)
5. ఆత్మనిక్షేపం (తనను భగవంతునికి అర్పించుట).
6. కార్పణ్యం (దీనభావము).

జ్ఞాన సుధ

మూలం : శ్రీ సర్వభూషణ శివయోగి

అనువాదం : శ్రీ శంకరానందగిరిస్వాములవారు (ఉమామహేశ్వర పీఠాధిపతులు)

ధరాదీశ్వరాంతం షడధ్వాత్మవిశ్వం

మనన్ బ్రహ్మ విద్వాన్ హృది స్వస్వరూపమ్,

చ్యుతోపాసనోపాసకోపాస్యభావో

రమ త్యన్వహం నేహ నానా ఽ స్తి వాక్యే.

ధరాది =భూమి మొదలు, ఈశ్వరాంతం= ఈశ్వరుని వఱకు, షడధ్వాత్మ=షడధ్వాత్మకమైన, (కళలు, వర్ణములు, పదములు, మంత్రములు, భువనములు, తత్త్వములనెడి యివి స్వరూపముగాగల) విశ్వం = జగత్తును, హృది = హృదయమందు, స్వస్వరూపం=తన (ఆత్మ) స్వరూపముగానే, మనన్= ఎఱుగుచు, చ్యుత ఉపాసనా ఉపాసక ఉపాస్యభావః = ఉపాసన, ఉసాసకుడు, ఉపాస్యము అను నీ భావములు జాఱిపోయినట్టి, బ్రహ్మ విద్వాన్= బ్రహ్మ నిష్ఠుడు, న ఇహ నానా అస్తి వాక్యే = ఇచ్చట నానాత్వము (ఏ భేదము) లేదని చెప్పెడి శ్రుతి వచనమందు, అన్వహం= నిరంతరము, రమతి =రమించును.

బ్రహ్మవిదునకు ఉపాసన ఉపాసక ఉపాస్య భేదరూపమగు త్రిపుటి అగపడదు. సముద్రమునందుండిన చేపకు అంతటను జలమే యగపడినట్లు, ఆకాశమునందు సంచరించు పక్షికి ఎక్కడ జూచినను బయలే యుండునట్లు బ్రహ్మవిదునకు తనకంటె అన్యము తోపదు. అందువలన వానియందు ఉపాసనాభావ మసంభవము.

" శుభకృత్ శుభమాప్నోతి, పాపకృత్ పాపమశ్నుతే" మంచిని చేసినవాడు మంచిని పొందుతాడు. (పుణ్యం చేసినవాడు పుణ్యాన్ని పొందుతాడు). పాపం చేసినవాడు పాపాన్ని అనుభవిస్తాడు. (మండోదరి)

పైమెట్టు - లోమెట్టు

- ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

కొండ ఎక్కితే పుణ్యం అని పామరులు చెప్పడమే కాదు భక్తిశ్రద్ధలతో గోవింద నామస్మరణ చేస్తూ తిరుపతి కొండలు ఎక్కుతుంటారు. ఆలోచిస్తే కొండెక్కడంలోని అంతరార్థాలలో ఇది ఒకటి మాత్రమే. మనిషి ఆకాశాన్ని చూడాలంటే మెడ పైకెత్తాలి. ఏవీ తోచనప్పుడు ఆకాశంకేసి చూస్తుంటాం. ప్రాణాలు పైకి ఎగిరిపోయాయి అని చెబుతుంటాం.

ఒక వస్తువు బాగా కనబడాలంటే ఆ వస్తువును ఎత్తైన బల్లమీద పెడతాం. పందెంలో గెలిచినవారిని విక్టరీస్టాండ్‌లో నిలబెట్టి గౌరవిస్తారు. రాజసింహాసనం ఎత్తైన ప్రదేశంలో ఉంటుంది. ఎత్తుగా కనబడడానికి కొందరు పెద్ద టోపీ పెట్టుకొంటారు.

తిరుమలలో స్వామి ఉన్నాడు. ఎత్తయిన కొండలమీద ఎందుకున్నాడంటే మూడు మూర్తులలో నేనే గొప్ప అని చెప్పడానికని కన్నడ హరిదాసులు అందంగా వర్ణించారు. మరి ఆ దేవునికంటె ఎత్తైనవారు లేరా? అని ప్రశ్న. ఉన్నారు. వారెవరో శ్రీనివాసుడే చెప్పాడు.

రాముని బంటు హనుమంతుడు దాస్యభక్తికి లక్ష్యప్రాయుడు. స్వామిముందు భక్తుడు కింద కూర్చోవాలి. లేదా సుదూరంలో నిలబడాలి. అలాకాకుండా తిరుమలమీద 'ఆంజనేయుడు' ఎత్తయిన ప్రదేశంలో ఉండడం తప్పు కదా! ఇది అవిధేయత కదా! అని ప్రశ్న. కాదు కాదు నా భక్తులలో సర్వశ్రేష్ఠుడు ఇతడే అని చెప్పడానికే ఎత్తు ప్రదేశంలో నిలబెట్టాడు. ఇది నా తప్పే. నాకూ అవమానంగానే ఉంది అంటూ చేతులు జోడించి ఆంజనేయుడు భక్తాంజనేయులుగా కనబడుతున్నాడు.

రామదర్శనం కావాలంటే హనుమదనుగ్రహం కావాలి. ఆ హనుమను ముందు దర్శిస్తే తిరుమలేశుని దర్శించడానికి మార్గం సుగమమవు తుందని మరో భావం.

మహంతు గొప్ప భక్తుడు. స్వామి ప్రతిరోజు రాత్రివేళ మహంతుతో పాచికలాడేవాడట. మహంతే గెలిచేవాడట. అందుకే స్వామి ఆటలో నీదే గెలుపు. అంచేత నా ఆలయంకంటె ఎత్తయిన ప్రదేశంలో మందిరం నిర్మించుకోమన్నాడట. అందుకే తిరుమలలో శ్రీవారి ఆలయానికంటే పైగా మహంతు మంటపం ఉంది.

ప్రదాత ఎప్పుడూ పైనే ఉంటాడు. గ్రహీత అతని కింద కనిపిస్తాడు. కాని బలిచక్రవర్తి ప్రదాత అయినవేళ విష్ణువే వామనుడుగా గ్రహీతగా కిందనే చేయిసాచాడు. అయితే కొన్ని సందర్భాలలో ప్రదాత క్రింద, గ్రహీత పైన ఉండడం కూడా లేకపోలేదు. 'నస్యం' ఎవరినయినా అడిగితే ఇచ్చేవాడు నస్యం డబ్బాను తాను పట్టుకొంటే పుచ్చుకొనేవాడు పై నుండి కాసంత నస్యాన్ని ధీమాగా పుచ్చుకొంటాడు.

జీవితంలో పై మెట్టు చేరుకొన్నవాళ్ళంతా అక్కడే ఉంటారను కోవడం పొరబాటు. పుణ్యాల కారణంగా జీవికి స్వర్గలోకప్రాప్తి. పుణ్యఫలం క్షయమయితే మరల భూలోకవాసమే.

ఏతాం తోడేవారిని చూస్తే ఒకసారి పైమెట్టు మరోసారి కిందకు. పరమపదసోపానం ఆటలో చాలా జాగ్రత్తగా పైకెక్కేవాడు తీరా గమ్యం చేరుకొనేవేళ పాము నోటబడి అధఃపాతాళానికి చేరుకొంటాడు.

పైమెట్టు చేరుకొనేవారు తమ స్థితిని ఏనాటికి మరచిపోరాదు. అందుకే మలయాళయతీంద్రులు పురోభివృద్ధిని కోరువారు పూర్వవృత్తాంతం మరువరాదన్నారు. నేల విడిచిన సాము ఎప్పటికీ అనర్థదాయకమే.

జీవుడా! మేలుకో!!

మూలం: **ఉద్ధవ గీత** అనువాదం:

శ్రీ వ్యాసమహర్షి యేలేశ్వరపు హనుమరామకృష్ణ

శ్రీ ఉద్ధవుడు: స్వామీ! శ్రీకృష్ణా! నాది మరొక్క సందేహం.

ఈ జీవునికి త్రిగుణముల ప్రభావం చేతనే దేహ పరంపరలు వచ్చి పోతున్నాయి కదా! అనగా దేహం ఉన్నంతవరకు గుణములు పరిఢవిల్లుతూనే వుంటాయి కదా! మరప్పుడు దేహము ఏర్పడి ఉండికూడా ఈ త్రిగుణములకు అతీతుడై వుండగలడా? దేహం ఉండి కూడా గుణాతీతుడై వుండటం ఎవ్వరికైనా సాధ్యమా? సాధ్యమైతే అట్టి గుణాతీతుడగు జీవుడు (దేహి) ఎట్లా ఉంటాడు? గుణాతీతుడైనవాడు దేహం ఉంది కాబట్టి బద్ధుడా? లేక ముక్తుడా? అతని విహారం ఎక్కడ? గుణాతీతుణ్ణి ఏ లక్షణములచే మనం గుర్తించగలం? ఆయన స్వీకార విసర్జనలు ఎట్లా వుంటాయి? ఎక్కడ ఎట్లా నివసిస్తాడు. ఎక్కడ శయనిస్తాడు? ఓ అచ్యుతా! గుణములు ప్రదర్శిస్తున్నప్పటికీ గుణాతీతుడై వుండేవాడిని గురించి మీరు మాత్రమే విశదీకరించగలరు.

ఒకే ఆత్మ నిత్య బద్ధమై వుంటోందా? నిత్య ముక్తమై కూడా వుంటోందా!

ఆత్మ సర్వదా ఏకమే అయి ఉండికూడా, బద్ధులు – అజ్ఞులు- విజ్ఞులు-ముక్తుల రూపాలు ఎందుకు దాల్చుతున్నది? -అన్నటువంటి ఈ విషయంలో నాకు ఎన్నో అనుమానాలు ఉంటున్నాయి. మీ సమాధానంతో నా అనుమానాలను తొలగించ ప్రార్థన!.

"నిత్య బద్ధాత్మ -జీవాత్మ:: నిత్యముక్తాత్మ -పరమాత్మ"- అనునది అధ్యాత్మశాస్త్ర సమీక్షయేనా? శాస్త్రీయదృష్టిచే యుక్తియుక్తమేనా?

శ్రీకృష్ణ భగవానుడు: ఆధ్యాత్మశాస్త్రము బంధముక్తుల గురించి నిర్వచిస్తోంది. అయితే, ఓ ఉద్ధవా! త్రిగుణములను దృష్టిలో పెట్టుకొని మాత్రమే "ఈతడు బద్ధాత్ముడు – ఈతడు ముక్తాత్ముడు"- అని శాస్త్రములు వ్యాఖ్యానించటం జరుగుతోంది. త్రిగుణములు మాయచే కల్పించబడినవి మాత్రమే కదా!... అందుచేత... ఆత్మకు వాస్తవానికి బంధము లేదు. బంధమనునదే లేదు కాబట్టి, ముక్తి అనబడునదేదీ కూడా లేదు! స్వప్నంలోని కొన్ని సంఘటనలకు స్వప్న ద్రష్టబద్ధుడౌతున్నాడా? మరికొన్ని సంఘటనలచేత ముక్తుడౌతున్నాడా? లేదే! స్వప్నము తనదైనవాడు స్వప్నంలో ఏదేది కనిపించినా కూడా మెలకువ వచ్చిన తరువాత యథాతథుడే కదా!

ఇక్కడి సుఖ దుఃఖాలు స్వప్నంలోని సంఘటనల వంటివే! నేను జీవాత్మను – బద్ధుడను అనునది కూడా స్వస్వరూపాత్మ దృష్ట్యా ఒకరాత్రి ఒకడికి వచ్చిన ఒక కలవంటిదే ! కలగనేవాడికి కలలో బంధము ఉన్నట్లా? లేనట్టా?

ఒకడు స్వప్నంలో ఒక గొప్ప 3 అంతస్తుల మేడ కట్టుచున్నాడనుకో! రెండవ అంతస్తు కట్టుచుండగా మేస్త్రీ – పనివారితో ఏవేవో ఇబ్బందులు వస్తున్నాయి. ఇంతలో.. మెలకువ వచ్చింది. నిద్ర లేవగానే ఆ మేడ ఎక్కడ? ఆ పనివారు ఇంకా రారేం?.. అంటూ అప్పటి ఆ స్వప్న దర్శి ఇప్పటి జాగ్రత్‌లో- ఇంటి నుండి బయలు దేరుతాడా? లేదు కదా! అదంతా స్వప్నమే కదా!.. అని అంతా క్షణంలో త్యజించి, ఇక వర్తమాన జాగ్రత్‌లో తన దినచర్యలకు ఉపక్రమిస్తాడు కదా! దేహ – దేహాంతరాలు ఈతీరైనవే!

స్వప్న బుద్ధి స్వప్నంలో అనేక సుఖ – దుఃఖాలుగా వివర్త మగుచున్నది కదా! అట్లాగే... జాగ్రత్ బుద్ధి దృశ్యమును పొందుచూ -ఇదంతా వాస్తవం-శాశ్వతం అనే భ్రమకు (వర్తమానము పట్ల) లోను అగుచున్నది. ఏది ఎట్టైనా ఉండవచ్చుగాక! ఇక్కడ జాగ్రత్‌లో అనుభవమగుచున్న శోకము -మోహము సుఖము -దుఃఖము - సామాన్యము - ఆశ్చర్యము -జననము- మరణము ఇవన్నీకూడా

దేహమునకు సంబంధించిన మాయా విశేషాలు అని గ్రహించు. మాయ అనగా? ఒకడు ఒక కథ వింటున్నాడు, (లేక) ఒక నాటకం చూస్తున్నాడు. అందులోని సుఖ-దుఃఖ -హాస్య-సంగతి- సందర్భ- సంబంధ -బాంధవ్యాలన్నీ నిజమే అని భావించి తాను అక్కడి పాత్రలకు సంబంధించిన రసానుభూతిని తన హృదయంలో పొందుచున్నాడు. నిజానికి అతడు ఆమెతో అన్నన్ని బాధించే మాటలు అంటూవుంటే... నాకు బాధ వేస్తోంది- అని నాటక పాత్రలను చూసి అనుకోవటం వంటిదే,ఈ దృశ్యము నుండి జీవుడు అనుభవించే సుఖ దుఃఖాలు కూడా! కనుక ""ఇక్కడి సుఖదుఃఖాలకు వాస్తవమైన ఉనికి లేదు. ఇది కాల బద్ధము, స్వప్న సదృశమేగా ఇదంతా!" - అనునది మరచి ఈ జీవుడు ఆ - యా విషయాలతో తాదాత్మ్యము పొంది వాటితో అవినాభావ పూర్వకమైన అనుభవమును పుణికి పుచ్చుకుంటూ కొనసాగించటమే జగత్తు (లేక) సంసారము అనబడుదాని నిర్వచనం.

ఓ ఉద్ధవా! "ఈ మాయా రచనకు రచయితను సర్వాంతర్యామినైన నేనే"- అని గ్రహించు! విద్య- అవిద్య. ఈ రెండూ కూడా నా యొక్క మాయా రచనయే! ఈ శరీరి నా మాయా రచన యందు నిమగ్నుడగుచున్నాడు. జీవుల యొక్క బంధము, మోక్షము అనే రెండింటికీ కారణం సర్వ తత్త్వస్వరూపుడగు నా మాయా చమత్కారమే!. మాయా రచయితను నేనే! దేహిని నేనే! దృశ్యము నేనే!

ఇక ఈ బద్ధ -ముక్తులగు జీవులు (దృష్టిలో) ఎవ్వరంటావా? ఇక్కడి ద్రష్టలంతా కూడా అద్వితీయ స్వరూపుడనగు నా అంశయే! అట్టి అంశభూతులగు జీవులకు అవిద్యచేత బంధము, విద్యచేత బంధరాహిత్యము కలుగుతోంది.

"నేను జీవుడను" అను భావనయే బంధము. "ఇక్కడి ద్రష్టత్వమంతా ఏ పరమాత్మయొక్క అంశయో అట్టి పరమాత్మ నాకు అద్వితీయుడు"- అని గమనించటంచేత మోక్షము. ఇంతకు మించి వేరే బంధము లేదు, మోక్షము లేదు. **(సశేషం)**

" దినకరుని జయంతి "

- డా ॥ కె.బి. రాజేంద్రప్రసాద్, ఎం.ఎ., పిహెచ్.డి.,

శ్లో ॥ శివరూపాత్ జ్ఞానమహంత్వత్తో ముక్తిం జనార్ధనాకారాత్ ।

శిఖిరూపాదైశ్వర్యం భవతశ్చారోగ్య మిచ్ఛామి ॥

శివునిరూపంతో ఆత్మ జ్ఞానాన్ని, విష్ణు రూపంతో మోక్షాన్ని, అగ్ని రూపంతో ఆరోగ్య ఐశ్వర్యాలను కల్పించే పరమాత్మ సూర్యనారాయణమూర్తి. కనుక ఆత్మ జ్ఞానాన్ని, మోక్షాన్ని, ఆరోగ్య ఐశ్వర్యాలను అనుగ్రహించాలని స్వామిని భక్తితో కోరుకొంటున్నాను". అంటాడు సాంబుడు. తండ్రి శాపంతో కుష్ఠురోగగ్రస్తుడైన సాంబుడు 12 ఆర్యా వృత్తాలలో సూర్యభగవానుని స్తుతించి, స్వామి అనుగ్రహాన్ని పొంది రోగవిముక్తిని పొందడం విశేషం. సాంబుని ప్రార్థనలో సూర్యదేవుని మహిమాప్రాభవం కొంత వివరంగా తెలుస్తోంది. చర్మం, కన్నులు, హృదయం, ఇంద్రియాలకు సంబంధించిన దోషాలను, రోగాలను పోగొట్టే దివ్య వైద్యుడు దినకరుడు. సర్వపాపహరుడు దివాకురుడు. సర్వాపదలను తొలగించే సర్వేశ్వరుడు సహస్రకిరణుడు. ప్రకృతి వికాసానికి, ప్రాణికోటి తుష్టికి, పుష్టికి, వృద్ధికి, బుద్ధికి, సిద్ధికి సహకరించే సర్వేశ్వరమూర్తి సూర్యదేవుడు. కన్పించే దైవం. కనికరించే కామధేనువు. జ్ఞానప్రదాత. చైతన్య స్ఫూర్తి. కర్మసాక్షి స్వామి. క్రమం తప్పకుండా కాలాన్ని నడిపిస్తూ, అలసట లేకుండా ఆగడం తెలియకుండా సాగడం, నిరంతర యానంతో ప్రయాణంతో ప్రపంచ జీవులకు ప్రమోదాన్ని పంచే పరమాత్మ స్వామి.

అలాంటి సూర్య భగవానుడు తొలిగ భూమిమీద సాక్షాత్కరించిన

దినంగా మాఘశుద్ధ సప్తమిని విజ్ఞులు పేర్కొన్నారు. "త్రయీమూర్తి దివాకరః" త్రిమూర్తులకు ప్రతిరూపమే సూర్యదేవుడు. జీవుల సృష్టి, స్థితి, లయాలకు స్వామి సహాయ సహకారాలను నిర్వచించలేము. జీవులకు ఆయుష్షు చతుర్ముఖ బ్రహ్మ వలన, ఐశ్వర్యం శివుని వలన, మాంగ్యలబలం జగన్మాత పార్వతీమాత వలన, ఆరోగ్యం భాస్కరుని వలన కల్గుతున్నాయని శాస్త్రవచనం. సృష్టికి, సృష్టి జీవులకు శక్తియుక్తులను ప్రసాదించే సూర్య నారాయణుని జయంతిగా "రథసప్తమి" అనే పేరుతో మాఘశుద్ధ సప్తమిని సర్వవైదిక సమాజం భావించి స్వామిని ఆ రోజు ప్రత్యేకంగా ఆరాధించడం జరుగుతోంది.

మాఘశుద్ధ సప్తమి నాడు, సూర్యోదయ సమయంలో, ఆకాశంలో గ్రహనక్షత్రాలన్నీ రథాకృని పొంది కన్పిస్తాయట. కనుక ఈ రోజును రథసప్తమి అన్నారు. బంగారురథం స్వామిది. దానికి ఒకే ఒక్క చక్రం. ఆ చక్రంలో ఆకులు ఆరు, గుర్రాలు ఏడు, అనూరుడు అనగా ఊరువు లేని వ్యక్తి సారథియట. కదలడమే కాని ఆగడం తెలియదు ఆ రథానికి, సాగడమేకాని సోలిపోవడం తెలియదు. అది నిత్య సంచారి. ఆ రథమే విశ్వం. విశ్వరథానికి ఉన్న ఏకైక చక్రం కాలం. ఆ చక్రంలో ఉన్న ఆకులే ఆరు ఋతువులు. ఏడు గుర్రాలే ఏడు రంగులు. అలసట లేని ఆత్మజ్ఞానానికి ప్రతీకయే అనూరుడు. స్వామి ఈ అంతటకూ తేడు. దినరాజు. కాదు ఈ సకల చరాచర ప్రపంచానికి చైతన్యాన్ని నింపి, ముందుకు కదిలించే సుజ్ఞాన మూర్తి శ్రీసూర్యనారాయణమూర్తి. అర్ఘ్యంతో, అంజలితో, ఆత్మీయ భక్తి భావంతో ప్రణతులర్పించే మనలను అనుగ్రహించే స్వామి చరిత్రను సంక్షిప్తంగా గుర్తుచేసుకొందాం.

కశ్యపుడు అదితులకు జన్మించిన వాడు ఆదిత్యుడు. కారణజన్ముడు. తండ్రి పేరు మీద కాశ్యపేయుడని, అదితి పేరు మీద ఆదిత్యుడని

స్వామికి పేర్లు వచ్చాయి. బ్రహ్మాండం మృతి నొంది రెండు ముక్కలైనప్పుడు జన్మించుటచే "మార్తాండుడు" అనియు స్వామిని పిలుస్తారు. బ్రహ్మదేవుడే ఈయనను "మార్తోభవ" అన్నాడనియును అంటారు. ఈ మార్తాండుని రూపాలే ద్వాదశాదిత్యులు. వీరు పంద్రెండుమంది అని చెప్తారు. సూర్యభగవానుని భార్య సంజ్ఞాదేవి. వీరికి జన్మించినవారే యముడు, యమున (నది). అయితే షోడశాంశలతో వెల్గొందే సూర్యభగవానుని తేజాన్ని తట్టుకోలేక సంజ్ఞాదేవి, తన నీడను అదే "ఛాయను" సూర్యుని దగ్గర వదలి తాను ఉత్తరమేరు భూములకు వెళ్ళింది. ఆ ఛాయ వలన సూర్యునకు శని, సావర్ణి అనే పుత్రులు, తపతి అనే కుమార్తెయును కల్గారు. అయితే కొద్ది కాలానికే సూర్యుడు సంజ్ఞాదేవి తనను వదలి వెళ్ళిన నిజాన్ని, అందుకు కారణాన్ని గుర్తించడం జరిగింది. అప్పుడు విశ్వకర్మ సూర్యభగవానుని తేజంలో 15 అంశలను తగ్గించాడు. స్వామిలోని ఋగ్వేదమయమైన తేజస్సుతో భూమిని, యజుర్వేద మయమైన తేజస్సుతో ద్యులోకాన్ని, సామవేదమయమైన తేజంతో స్వర్గాన్ని ప్రతిష్ఠించాడు. శంకరునికి శూలం, విష్ణువుకు సుదర్శన చక్రం, దేవతలకు ఆయుధాలు సూర్యునినుండి లేసిన తేజో అంశ ఫలితాలే. అనంతరం సూర్యభగవానుడు తన నిజధర్మపత్నిని కలసి ఊరట కల్గించాడట. సూర్యభగవానుని కుమార్తె తపతి సంవరుణుడను చక్రవర్తిని పెండ్లాడింది. వీరికి జన్మించినవాడే "కురు" అనే చక్రవర్తి. కురువంశానికి మూల పురుషుడు.

సూర్యభగవానుడు సర్వవేదవేదాంగ శాస్త్ర కౌశలుడు. హనుమంతుడు, యాజ్ఞవల్క్యుడు స్వామి దగ్గర, స్వామితోపాటు ప్రయాణం చేస్తూ వేదశాస్త్రాలు నేర్చుకొన్నారు. సూర్యభగవానుడు ప్రతిరోజు 90 కోట్ల, యాభై లక్షల యోజనాలు సంచరిస్తాడని పురాణ వచనం. స్వామి మందగతి, శీఘ్రగతి, సమానగతి అనే త్రివిధ గతులు

కల్గియుంటారు. ఈ గమన రీతులు కారణంగానే దక్షిణాయనంలో పగలు, ఉత్తరాయణంలో రాత్రి కాలాలు కొద్ది ఎక్కువగా కన్పిస్తాయి. స్వామి మేష, తులారాశులలో సంచరించినప్పుడు మాత్రమే రాత్రింబవళ్ళు సమానంగా ఉంటాయని పెద్దలు సెలవిస్తున్నారు.

దినకరుడు ధర్మజ్ఞుడు. ధర్మగ్లానిని, సంప్రదాయపు హానిని సహించడు. జమదగ్నిమహర్షి బాహ్యశృంగారం చేస్తుంటే స్వామి వారించబోయినాడు. ఫలితంగా జమదగ్ని "నా ఆనందాన్ని ప్రతిఘటించిన నిన్ను రాహువు మ్రింగుగాక! నీ తేజాన్ని మేఘాలు అప్పుడప్పుడు కప్పివేయుగాక" అని శపిస్తాడు "శ్రేయాంసి బహువిఘ్నాని" మంచికి ఆటంకాలు ఎక్కవేగదా! కుంతీదేవికి సూర్యవరప్రసాదంతోనే సద్యోగర్భమున సహజ కవచకుండలాలతో కర్ణుడు జన్మించాడు. సహస్ర కవచుడనే దానవుడు నరనారాయణులతో యుద్ధం చేసి 999 కవచాలను నశింపచేసుకొని, చివరకు దేహాన్ని వదలి, మిగిలిన ఒక కవచంతో రాక్షస గుణ సమన్వితంగా కుంతికి కర్ణుడిగా జన్మించాడు. ఇది విధి ప్రేరణ. కనుకనే నరనారాయణులు మరుజన్మలో కృష్ణార్జునులై కర్ణుని మరణానికి కారకులైనారు. వనవాసంలో ధర్మరాజు సూర్యదేవుని ఆరాధించి, అన్ని వంటకాలను ఇట్టే సమకూర్చే వెలుసుబాటును పొందాడు. మయూరుడనే కవి సూర్యభగవానునిపై గీర్వాణభాషలో శతకం చెప్పి, కుష్ఠురోగం నుండి ముక్తిని పొందినట్లు తెలుస్తోంది.

సూర్యభగవానుడు శివభక్తుడు. కాశీనగరకాంతపై మహాదేవునకు మక్కువ ఎక్కువ. కాశీనగరరాజు ధర్మపరుడును అయిన దివోదాసును, ధర్మచ్యుతినిగా చేసి, కాశీనుండి వెడలగొట్టవలసిందిగా మహాదేవుడు సూర్యుని కాశీకి పంపినాడు. కాని ధర్మపరుడైన దివోదాసుని సూర్య భగవానుడు ఏమియు చేయలేక, రిక్తహస్తాలతో శివుని చేరలేక కాశీలోనే

ఉండిపోయినాడు. కాశీ అవిముక్తక్షేత్రం. ఎవరికిని విడువరానిది పుణ్యగుణాలరాశి కాశి. ముక్తికాంతా ఒడి, బడి కాశి. అందుకు సూర్యభగవానుడు 12 రూపాలను పొంది ద్వాదశాదిత్యులుగ పిలువబడుతూ, కాశీనగర ప్రజల యోగ క్షేమాలను చూస్తూ ఉండి పోయినాడు. వారే లోలార్కుడు, ఉత్తరార్కుడు, సాంబాదిత్యుడు, ద్రుపదాదిత్యుడు, మయూఖాధిత్యుడు, వినతాదిత్యుడు, అరుణాదిత్యుడు, వృద్ధాదిత్యుడు, కేశవాదిత్యుడు, విమలాదిత్యుడు, గంగాదిత్యుడు, యమాదిత్యుడనేవార్లు.

రథసప్తమి నాడు గంగా స్నానమాచరించి ఈ ద్వాదశాదిత్యులను స్మరించినవారు లేదా సందర్శించినవారు, లేదా ఉపాసించినవారు సప్తజన్మకృత పాపాలనుండి విముక్తిని పొందుతారని ప్రతీతి.

వెలుగుల రాజయిన సూర్య భగవానుని వైదిక సమాజం రథసప్తమినాడు అనగా మాఘశుద్ధ సప్తమినాడు భక్తి శ్రద్ధలతో ఆరాధించి ఆధ్యాత్మికానంద పరవశులవుతున్నారు. చీకట్లను తరిమి వెలుగులనందించే సూర్యదేవుడు లేని, రానికాలాన్ని ఊహించలేము. సూర్యోదయంతోనే సకల జగతి నిద్రను వీడి జాగృతిని పొందుతోంది. మన సంప్రదాయంలోనే లేవడమే అరచేతులను చూచుకొని, భూమాతకు మ్రొక్కి సూర్యదేవునకు నమస్కరించడం ప్రధానం. ముక్కారుసంధ్యలలో మనం చదివే మంత్రంలో గాయత్రి, సావిత్రి, భారతమాతల శక్తులు సవితృ దేవతయై సూర్యునిలోనే కాంచుతున్నాం. అలాంటి సూర్యభగవానుని జయంతి రథసప్తమి పుణ్యకాలం పావన సమయం. సంధ్యావార్చుడం, అర్ఘ్యమివ్వడం సర్వసాధారణం. కాని రథసప్తమినాడు ప్రత్యేకంగా మగవారు జిల్లేడు ఆకులు, ఆడువారు చిక్కుడాకులను భుజాలపై, తలపై ఉంచుకొని స్నానం చేస్తారు. జిల్లేడు, చిక్కుడు స్వామికి ప్రతీకలు. అర్కవృక్షమని జిల్లేడుకు

పేరు. ఏడు రంగులకు గుర్తు ఏడు ఆకులు.

"జననీ త్వం హి లోకానాం సప్తమీ సప్తసప్తికే, సప్తవ్యాహృతికే దేవీ! నమస్తే సూర్యమాతృకే।" "ఏడు ముఖాల సప్తమీ! నీవు సకల భూతాలకు, లోకాలకు తల్లివి. సూర్యదేవునకును మాతవు. నీకు నమస్కారం" అంటూ మంత్రపఠనం చేస్తూ స్నానమాచరించి, స్వామికి పాయసాన్ని నైవేద్యంగా అర్పించి, మన బాధలను తీర్చాలని, ఆరోగ్యాన్ని అందించాలని కోరుకొందాం.

మంచిని పెంచితేనే మనిషి

–డా॥ పులివర్తి కృష్ణమూర్తి

ప్రపంచమే ఒక విద్యాలయము
కొత్తదనాలతో, సరికొత్త అందాలతో
ఈ జగమే ఒక నందనవనము
కొత్త కొత్త ఆశలతో, కొత్తదనాన్ని
కోరుకుంటూ, ఏకత్వంలో భిన్నత్వాన్ని
భిన్నత్వంలో ఏకత్వాన్ని
సద్భావనతో, సదాశయంతో
మంచినే విందాం, మంచినే చూద్దాం.
సాటి మనిషిని గౌరవిద్దాం
అందరినీ ఆదరిద్దాం
ప్రపంచ శాంతికి బాటవేద్దాం.
మనిషి మనిషిగా బ్రతకాలంటే
మంచిని పెంచాలి
మంచి యన్నది పెంచాలంటే
మన మనసే పెరగాలి
ప్రతి మనిషీ ఎదగాలి

శ్రీ మదాంధ్ర మహా భాగవతం

– ఆచార్య జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

మొదట ఈ బ్రహ్మాండమంతా ఒక భవనంలాగా ఉండేది. ఈశ్వరుడు దాన్ని పద్నాలుగు లోకాలుగా ఏర్పరచాడు. ప్రపంచమంతా ఆయన శరీరమే. పద్నాలుగు లోకాల్లో పైన ఉండే ఏడు లోకాలు ఆ భగవంతుడి నడుముకు పై భాగాలు. క్రింది ఏడు లోకాలు నడుముకు క్రింది భాగాలు. ఆ మహావిష్ణువుకు కటిస్థలం భూలోకం. నాభి భువర్లోకం. హృదయం సువర్లోకం. వక్షం మహర్లోకం. కంఠం జనలోకం. స్తనాలు తపోలోకం. శిరస్సు సత్యలోకం. జఘనం అతలం. తొడలు వితలం. మోకాళ్ళు సుతలం. పిక్కలు తలాతలం. చీలమండలం, కాలి మునివ్రేళ్ళు రసాతలం. అరికాళ్ళు పాతాళం. కాబట్టే ఆయనను లోకమయుడని కొనియాడతారు. సృష్టి అంతా మూడు లోకాలే అని భావించేవారు శ్రీహరి పాదం నుంచి భూలోకము, బొడ్డు నుంచి భువర్లోకము, శిరస్సు నుండి స్వర్లోకము పుట్టాయని చెబుతారు.

ఈశ్వరుడి పాదాలను, ఊరువులను, భుజాలను, ముఖాలను, నేత్రాలను, శిరస్సులను, నొసళ్ళను, చెవులను లెక్కపెట్టడం ఎవరికీ సాధ్యం కాదు. ఆ భగవంతుడి ముఖం నుంచి బ్రాహ్మణ కులము, బాహువుల నుంచి క్షత్రియ కులము, తొడల నుంచి వైశ్య కులము, పాదాల నుంచి శూద్రకులము పుట్టాయి. ఈ మహానుభావుడే ప్రాణుల శరీరాల్లోనూ నెలకొని విహరిస్తూ ఉంటాడు. ఈయనే యోగుల హృదయాలలో అర్చనీయంగా ఉంటాడు.

శ్రీమన్నారాయణుడి ముఖం నుండి సమస్త ప్రాణుల వాక్కులు, వాక్కుల కధిపతియైన అగ్ని పుట్టాయి. చర్మం, రక్తం, మాంసం, మెదడు,

ఎముకలు, మజ్జ, శుక్లం ఏడు ధాతువులని చెబుతారు. మరొక పద్ధతిలో రోమాలు, చర్మం, మాంసం, ఎముకలు, స్నాయువులు, మజ్జ, ప్రాణాలు ఇవి ఏడు ధాతువులని వర్ణిస్తారు. వాటిలో రోమాలు ఉష్ణిక్ ఛందస్సనీ, చర్మం ధాత్రీ ఛందస్సనీ, మాంసం త్రిష్టుప్ ఛందస్సనీ, స్నాయువు అనుష్టుప్ ఛందస్సనీ, శల్యం జగతీఛదస్సనీ, మజ్జ పంక్తిఛందస్సనీ, ప్రాణం బృహతీ ఛందస్సనీ వ్యవహరిస్తారు. దేవతల కర్పించే పురోడాశరూపమైన హవ్యానికీ, పితృదేవతలకిచ్చే చరరూపమైన కవ్యానికీ, అమృతానికి, తీపి మొదలైన ఆరు రసాలకు, రసనేంద్రియానికి, రసానికి అధీశ్వరుడైన వరుణుడికి విష్ణుదేవుడి రసనేంద్రియమే జన్మస్థానం. అలాగే అన్ని ప్రాణాదులకు వాయువుకు విష్ణుని నాసారంధ్రం నెలవు. దగ్గరగానూ, దూరంగానూ వ్యాపించే వాసనలకు, ఓషధులకు, అశ్వినీదేవతలకు ఆ పరమేశ్వరుడి ఘ్రాణేంద్రియం స్థానం. దేవలోకానికి, సత్యలోకానికి, తేజస్సుకు, సూర్యుడికి, సకల నేత్రాలకు లోకనేత్రుడైన పరమాత్ముని చక్షురింద్రియమే నివాసం. దిక్కులకు, ఆకసానికి, శ్రవణాంశాలకు, శబ్దానికీ సర్వేశ్వరుడి శ్రోత్రేంద్రియమే జన్మభూమి. ప్రశస్తాలైన వస్తువులకు, కొనియాడదగిన సౌందర్యాలకు పరమపురుషుడి శరీరమే స్థానం. స్పర్శానికి, గాలికి, నైగనిగ్యానికీ ఆ దివ్య శరీరుడి త్వగింద్రియమే ఇల్లు. చెట్లూ, పొదలూ, తీగలూ మొదలైన వాటికి పురుషోత్తముడి రోమాలు స్థానాలు. రాళ్ళూ, లోహాలు ఆ విశ్వమయుడి గోళ్ళు. మబ్బులు సరోజాక్షుడి శిరోజాలు. మెరుపులు సర్వేశ్వరుడి మీసాలు. భూలోక భువర్లోక సువర్లోకాలను కాపాడే లోకపాలకుల పరాక్రమాలకు, భూలోకం మొదలైన లోకాల క్షేమానికీ, శరణానికీ నారాయణుని పరాక్రమం నట్టిల్లు. ఎల్ల కోరికలకు శ్రేష్ఠమైన వరాలకు ఆ పవిత్రపాదుని పాదపద్మాలే నిలయాలు.

జలాలు, శుక్లం, పర్జన్యుడు, ప్రజాపతి సృష్టి, వీటన్నిటికీ ఆ సర్వేశ్వరుడి పురుషాంగం జన్మస్థలం. సంతతికి కామం మొదలైన పురుషార్థాలకూ, మనస్సుకు హాయి కలిగించే ఆనందాలకూ, శరీర సుఖానికి అచ్యుతుడి గుహ్యేంద్రియం స్థానం. యముడికీ, మిత్రుడికీ, మల విసర్జనానికి

ఆ దేవుని గుదేంద్రియం ఇల్లు. హింసకు నిర్మతికీ, మృత్యువుకూ, నరకానికీ ఆ సర్వేశుడి గుదం నెలవు. అవమానానికీ, అధర్మానికి, అవిద్యకూ, చీకటికీ అంతము లేని ఆ దేవుడి వీపు నివాసం. నదీనదాలకు ఈశ్వరుడి నాడీ సంఘం పుట్టిల్లు. కొండలకు అధోక్షజుడి ఎముకలు జన్మస్థానాలు. ప్రధానానికీ, అన్నరసానికీ, సముద్రాలకూ, భూతాల విలయానికీ ఆ బ్రహ్మాండ గర్భుడి ఉదరమే ఉనికిపట్టు. మానసిక వ్యాపారరూపమైన లింగదేహానికి గొప్ప మహిమ గల ఆ దేవుడి హృదయం సృష్టిస్థానం.

శివుడికి, నీకూ, నాకూ, సనత్కుమారుడు మొదలైన కుమార వర్గానికి, ధర్మానికి, సత్త్వానికి, విజ్ఞానానికి శ్రేష్ఠమైన మనికిపట్టు ఆ పరమేశ్వరుడి ఆత్మే. మానవులూ, దేవతలూ, దానవులూ, పితరులూ, ఉరగులూ, గజాలూ, మృగాలూ, గంధర్వులూ, నేనూ, ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ప్రపంచమంతా విష్ణుమయమే. వేయి మాటలెందుకు? బ్రహ్మాండ భాండాలన్నీ అతని జానలో ఇమిడిపోతాయి. కేవలం బుద్ధిబలంలో మనం ఆ దేవదేవుణ్ణి తెలిసికోలేము. పోయినవీ, ఇప్పుడున్నవీ, రానున్నవీ, అన్ని లోకాలూ విష్ణువులోనే ఉన్నాయి. తన మండలంలో ఉంటూ లోకాన్ని ప్రకాశింపజేసే సూర్యుడు లాగే విష్ణువు కూడా బ్రహ్మాండంలోనే ఉంటూ దాన్ని ప్రకాశింపజేస్తున్నాడు."

తెలుసుకోవాలనే కుతూహలమూ, ప్రశ్నించే విధానమూ, తెలియజెప్పే వాళ్ళను ముగ్ధులను జేసి వారిచేత విడమరచి చెప్పిస్తాయని నారదుడి ప్రశ్నలకు బ్రహ్మ స్పందించిన తీరు బోధపరుస్తుంది. బ్రహ్మదేవుడంతటివాడు కూడా తనకు చాలినంత జ్ఞానం కాని, శక్తిగాని లేవని నారదుడికి చెప్పడం ఆయన ఉదాత్త వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తుంది. బ్రహ్మదేవుడి మాటలను బట్టి సామాన్యులమైన మన అల్పత్వం కూడా అవగతమవుతుంది. విశ్వమేర్పడిన విధానాన్ని బ్రహ్మదేవుడు తెలియజేయడం వల్ల దాని ప్రామాణికత, విశ్వసనీయత విదితమవుతాయి. అన్నీ తానే అవ్వడం, అన్నీ అయ్యేటట్టు తానే చెయ్యడం విస్మయకరమైన విష్ణులీలలను వెల్లడిస్తాయి. **(సశేషం)**

లోకాస్సమస్తాః - సుఖినోభవంతు

- జి.ఎన్.కల్యాణసుందరం

జీవరాసులలో మానవజన్మ అత్యుత్తమ స్థానాన్ని అలంకరించు కున్నది. మానవీయతను దైవ స్వరూపంగా పోల్చబడినది. "దైవం మానుషరూపేణ" మానవుడు సర్వశక్తి సంపన్నుడు. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసాదులు అతని పంచప్రాణములు. "సత్యం బ్రూయాత్, ప్రియంబ్రూయాత్, న బ్రూయాత్ సత్యమప్రియం" భగవంతుడొసగిన ఈ మానవదేహ మొక దేవాలయంగా భావించి, శ్రద్ధా భక్తితో, నిష్కల్మషభావంతో, సాత్విక గుణ సంపదతో సద్వినియోగ పరచుకొనవలెను. మన భారతదేశము శ్రీరామచంద్రుడేలిన పుణ్యభూమి. మన దేశంలో అనేక పురాణ పురుషులు, రాజేంద్రులు,.యతీశ్వరులు,దాసశ్రేష్ఠులు, మఠాధిపతులు, కవిసార్వభౌములు, పండితోత్తములు జన్మించి అమరజీవులై ప్రసిద్ధిగాంచిరి. ఈ పవిత్ర భూమియందు జన్మమొందుటొక అదృష్టంగా భావించతగినది. ఈశ్వర నిర్మితమైన మానవ దేహమును పవిత్రమైన మార్గమందు సద్వినియోగ పరచుకొనవలెనని మన భారతీయ సంస్కృతి నవవిధ మార్గములను సూచించియున్నది.

అవి శ్రవణం, కీర్తనం, విష్ణోః స్మరణం, పాదసేవనం, వందనం, అర్చనం, దాస్యం, స్నేహం, ఆత్మ నివేదనం. బ్రహ్మమయమైన జగత్తు కర్మమయము. మానవ జన్మ కర్మాచరణకు లోబడియున్నది. "కర్మాను బంధీని మనుష్యలోకే" విజ్ఞుడు సాత్విక కర్మలనాచరించి నిర్మల సుఖశాంతుల ననుభవించగలడు. రజోతమోగుణ సంబంధమైన కర్మములందు పాల్గొను అజ్ఞానులు దుష్ఫలితముల ననుభవించక తప్పదు. జ్ఞాని స్థితప్రజ్ఞుడు. ఆవేశానికి, ఉద్రేకానికి చలించడు. విధి వైపరీత్యమున ఎదుర్కొను అనివార్య సమస్యలకు పరితపించడు. అందుబాటులో నున్న అదృష్టానికి పొంగిపోవుట గాని, అడుగంటిపోవు దురదృష్టానికి కృంగిపోవుట గాని ఆతనిలో కనుపించదు. మన హృదయంలో దాగియున్న పరమాత్ముని గుర్తించి, భగవంతుని భక్తిభావంతో స్మరించినచో, ఆనంద మనశ్శాంతులు తప్పక పొందగలము. మానవుడు సర్వకర్మాచారములను చిత్తశుద్ధితో జరిపించవలెను. "చిత్తస్యశుద్ధయే కర్మ" మానవదేహమొక కర్మక్షేత్రమైనచో, అతని హృదయ మొక ధర్మక్షేత్రముగా భావించతగినది. పవిత్రమైన దేహము, పరిశుద్ధమైన హృదయము, స్వచ్ఛమైన పలుకు మానవీయత లక్షణాలుగా పరిణమిస్తుంది. భగవంతుని కృపాకటాక్షము వలన అనుగ్రహింపబడిన మానవ దేహమొక వరప్రసాదంగా భావించి, రాగవిరాగాలకు దూరంగా, మానవుడాతని శేష జీవితమును దైవ చింతనతో దివ్యంగా, సవ్యంగా, భవ్యంగా గడపవలయును. భగవంతుడు కాలస్వరూపుడు, మానవుని జనన మరణాదులు దైవ నిర్ణయంతో కూడియున్నవి. కాబట్టి కాలాన్ని వ్యర్థం చేయక, మన జీవితాన్ని సచ్చింతనతో, సత్కార్యాలతో సముచితంగా కార్యనిరతులై సార్థక మానవులుగా, ప్రాయోజకులుగా జీవితాన్ని సద్వినియోగపరచుకోవాలి.

2018వ సంవత్సర మంతరించి 2019వ సంవత్సరం చోటు చేసుకున్నది. ఈ నూతన సంవత్సరం సుఖ సంతోషాలను, ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధిని, అమితమైన శుభ సూచనలనందించగలదనెడి దృఢ విశ్వాసమును ప్రజాసమూహ మెదురుచూతురు. ఈ అభిరుచులు పొందుటకై అనేక దేవాలయములయందు పూజా పునస్కారంబులాచరింతురు. వేద పండితుల ద్వారా వారి వారి భవిష్యత్కాలము చక్కబడుటకై యజ్ఞ యాగాదులందు పాల్గొందురు. వారి కుటుంబ పరివారంబుల యోగ క్షేమాదులనాశించి జోతిష్కుల సలహాల పొందనెంతురు. కాని మానవుడి సుఖదుఃఖాలను, కష్టనష్టాలను నూతన సంవత్సరంచే పరిహరించడం

సాధ్యం కాదు. ఈ విశ్వమంతా భగవంతుని అధీనమై యున్నది. ప్రకృతి నెదురింప మానవు లనర్హులు. ప్రపంచమందు సంభవించు క్షామములు, భూకంపములు, జలప్రవాహములు, వరదలు, ఆకస్మిక దుర్మరణములు మొదలైన సంఘటనలు ప్రకృతి వైపరీత్యమైనది.

పాంచభౌతిక దేహమును ధరించిన మానవునకు కష్టనష్టములు, సుఖ దుఃఖాదులు, జయాపజయములు సర్వ సామాన్యము. ఈ దినపు దుఃఖము రేపటి సుఖంగా పరిణమించగలదు. మానవుడాచరించు కర్మాచారముల ననుసరించి సుఖదుఃఖము లేర్పడగలవు. ఈ సుఖ దుఃఖములను, లాభనష్టములను, జయాపజయములను సమభావముతో స్వీకరించవలెను. "సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ" మానవులందరం భగవంతుని బిడ్డలము. మానవుడు స్వార్థరహితుడై నిఃస్వార్థతతో ప్రపంచమం దెల్లరి సుఖశాంతుల నర్థించవలెను.

మహేశ్వరుడు క్షీరసాగర మథనంబున ఉద్భవించిన హాలా హలమును, ప్రపంచ శ్రేయస్సు నాశించి తన కంఠమునందు నిలుపు కొనెను. వ్యాస మునీంద్రుడు భాగవతమును రచించి అతని పుత్రుడైన శుక మహర్షికి బోధించి లోక కల్యాణార్థ నిమిత్తమై ప్రచారింపజేసెను. శ్రీకృష్ణ పరమాత్మ రణరంగమున పార్థునకు భగవద్గీత నుపదేశించి, వ్యాస మహర్షి ద్వారా లోకానికందజేసి ప్రజల నాకర్షించగలిగెను. ఈ రీతిగా దేశ సౌభాగ్యము మానవుని ఆచార వ్యవహారముల ద్వారా తొడగియున్నది.

మానవుని చర్యలు అతని మనోభావముల ననుసరించి యున్నది. మనస్సు యొక్క పరివర్తన మానవుని సంకల్పముపై ఆధారపడియున్నది. ప్రజల యోగక్షేమాదుల నాశింప, లోక కల్యాణాన్ని ప్రోత్సహింప, మానవుడు నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక సూత్రముల నవలంబించి, సాత్విక గుణసంపదల

పోషించి, సత్కర్మల నాచరించి ప్రాయోజక మానవుడుగా వర్తించవలెను.

"పరోపకారార్థమిదం శరీరం" అన్న ఆర్యోక్తి ననుసరించి ఉపయుక్తమైన ప్రజాసేవకు పాత్రుడై మెలగవలెను. ఇతరులను ద్వేషించక, మనోవాంఛలకు తావివ్వక త్యాగశీలులై పేరొందవలెను. కామ, క్రోధ, లోభాదుల విస్మరించి, సత్య, ధర్మ, శాంతి, సహనాదులను విస్తరించి మన దేశ ప్రతిష్ఠతను అభివృద్ధి పరచవలెను. దేహాభిమానమును వీడి ఆత్మాభిమానమును బలపరచవలెను. గడచిపోయిన భూతకాలమును తలపోయక, రాబోవు భవిష్యత్కాలముపై పగటి కలలు కనక జరుగుతున్న వర్తమాన కాలాన్ని సద్వినియోగ పరచుకొనవలెను. "సర్వలోక హితే రతః" అన్న లోకోక్తిని గుర్తించి, లోకక్షేమాన్ని ప్రధానంగా భావించి దేశశ్రేయస్సుకై శ్రమించవలెను.

భగవంతుడొసగిన మానవ జన్మను నిర్లక్షించక, సాత్విక మనోభావంతో, సదాచార నిమగ్నుడై భగవంతుని నామస్మరణతో గడిపినట్లైతే, మానవుడు తన మానసిక సమస్యల నుండి విముక్తి నొంది, సుఖ శాంతుల పొందగలడు.

మీకు తెలుసా ?

సూర్యాంతర్వర్తియగు దేవతకు **సవిత** అని పేరు.

పైకి కనుపించే సూర్యగోళం పేరు **ఆదిత్యుడు**

సూర్యగోళాంతర్వర్తియగు **సవిత** అనే దేవతకు ఇంకా లోపల వెలిగేది **నారాయణుడు.**

అందుకనే **"ధ్యేయస్సదా సవితృమండలవర్తీ నారాయణః"** అన్నారు.

కళ్లు మిరుమిట్లు గొలిపేటంత తెల్లని కాంతితో దర్శనమిచ్చే దేవతకు **"భర్గుడు"** అని పేరు.

మంత్రమంటే మనస్సును ప్రభావితం చేసే శక్తివంతమైన **మాట.**

శ్రీరామకృష్ణ ఉవాచ

– శ్రీ రామకృష్ణ పరమహంస

జ్ఞానసముపార్జనానంతరం కొందరు లోకశిక్షణార్థం కర్మలు చేస్తుంటారు. జనకుడు, నారదుడు మొదలైనవారు ఈ కోవకు చెందుతారు. కాని ఆవిధంగా లోకులకు ఉపదేశం చేయాలంటే ఎంతో శక్తి అవసరం. ఋషులు కేవలం తమవరకే జ్ఞానం సంపాదించుకోవడంలోనే తలమునకలై ఉండేవారు. కాని నారదాది ఆచార్యులు లోకకళ్యాణం గురించి యోచించేవారు. వారు వీర పురుషులు.

(తేలికైన) పనికిరాని కఱ్ఱ నీటిపై తేలుతూ పోతున్నప్పుడు దాని మీద ఒక పక్షి వాలినా అది మునిగిపోతుంది. కానీ భారీగా ఉన్న కొయ్యదుంగ నీటిపై తేలుతున్నప్పుడు ఆవు, మనిషి, చివరకు ఒక ఏనుగు కూడా దానిపై ఎక్కినా అది మునిగిపోకుండా నిభాయించుకోగలదు. స్టీమర్ తనంతట తాను ఆవలి ఒడ్డుకు చేరటమేగాక ఎంతోమందిని ఒడ్డుకు చేరుస్తుంది. నారదుడు మొదలైన ఆచార్యులు ఇలాంటి భారీగా వున్న కొయ్యదుంగలు, స్టీమర్లవంటివారు.

కొందరు ఏదైనా రుచిగల పదార్థాన్ని తిన్న తరువాత మరెవ్వరికీ అది తెలియకుండా తువ్వాలుతో మూతిని తుడుచుకొని కూర్చుంటారు. మరికొందరు ఉంటారు– అలాంటి వ్యక్తికి మామిడిపండు లభించినప్పుడు దాన్ని కోసి అందరికీ పంచుతాడు. తాను కూడా తింటాడు. నారదాది ఆచార్యులు జనులందరి మేలుకోసరం జ్ఞానోపలబ్ధి తరువాత కూడా భక్తిని ఆశ్రయించి ఉండేవారు.

* * *

పేలాలు వేయించేటప్పుడు మూకుడు నుండి ఒకటి రెండు ఎగిరి నేలమీద పడుతాయి. అవి ఏమాత్రం మరక లేకుండా మల్లెపూవుల్లా వుంటాయి. మూకుడులోనే ఉన్న పేలాలు కూడా మంచివే. కాని అవి అలా మల్లెపువ్వుల్లాగా ఉండవు. వాటికి కొద్దిగా మరక అంటి వుంటుంది. అదేవిధంగా సన్న్యాసి జ్ఞానోపలబ్ధి పొందాక మల్లెపువ్వులా ఎలాంటి మరకలు లేకుండా వుంటాడు. అయితే జ్ఞానం పొందాక సంసారమనే మూకుడులో ఉండేవాడికి కొద్దిగా ఎర్రమరక పడే అవకాశముంది.

– (రామకృష్ణ కథామృతం నుండి)

వార్తలు

(01). 1-1-2019 తేది మంగళవారం ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకొని శ్రీకాళహస్తి సమీపం పెళ్లకూరు మండలం, పెళ్లకూరు గ్రామంలో ఆశ్రమ కంటివైద్య శిబిరం నిర్వహింపబడినది. అందు ఆశ్రమ భక్తకన్నప్ప కంటివైద్య సిబ్బంది మరియు డా॥ జయచంద్రప్ప గ్రామ ప్రజలకు కంటి పరీక్షలు చేసి తగు మందులిచ్చారు.

(02). 4-1-2019 తేది మాసశివరాత్రి సందర్భంగా శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో ప్రదోషకాలంలో నర్మదేశ్వర మహాదేవునకు రుద్రాభిషేకం, బిల్వార్చన జరిగినది. భజనల తరువాత ప్రసాద వితరణ జరిగినది.

(03). 4-1-2019 తేది తిరుపతి శ్రీరామకృష్ణమిషన్ ఆశ్రమ ప్రాంగణంలో జరిగిన సమరసతాసేవా ఫౌండేషన్ వారి జిల్లా కార్యకర్తల సమావేశంలో పూజ్యశ్రీ స్వాములవారు పాల్గొని వారికి తమ సందేశాన్ని అందజేశారు.

(04). 5-1-2019 తేది శనివారం భగవాన్ శ్రీరమణమహర్షి జయన్తి శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరిగినది. శ్రీరమణ మహర్షుల ఛాయా చిత్రానికి షోడశోపచార పూజ జరిగి ప్రసాద వినియోగం చేయబడింది.

(05). 12-1-2019 తేది శనివారం నాడు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో స్వామి వివేకానన్ద జయన్తి జరిగినది. వివేకానన్ద స్వామి ఛాయా చిత్రానికి అర్చన చేయబడినది. సాయంకాలం స్వామి వివేకానన్దుని గురించిన సభ జరిగినది. వివేకానంద స్వామిని గురించి ప్రసంగాలు జరిగినవి. బ్రహ్మచారి విజయానందగారు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

(06). 16-1-2019 తేది నుండి ప్రారంభమైన 7వ భాగవత సదస్సు 22-1-2019 తేది వరకు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరిగినది. సప్తమ స్కంధంలోని ప్రహ్లాద చరిత్రలోని ప్రహ్లాదుని భక్తి వైశిష్ట్యాన్ని గురించి పూజ్య శ్రీ సర్వాత్మానందస్వాములవారు ప్రసంగించారు.

(07). 23-1-2019 తేది నుండి ప్రారంభమైన 8వ భాగవత సదస్సు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో ఉదయ ప్రవచనము, సాయంకాలం వేళ శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీ ప్రసన్న వరదరాజస్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీస్వామి విద్యాప్రకాశానంద వేదికపై జరుగుచున్నది. ఈ సదస్సులో అనంతపురం జిల్లా లత్తవరంలోని ఉమామహేశ్వర పీఠాధిపతులు పూజ్యశ్రీ ప్రణవానందగిరిస్వాములవారు అష్టమ స్కంధంపై ప్రవచన చేస్తున్నారు.

(8). శ్రీ శుకబ్రహ్మాశ్రమ త్రినేత్ర వైద్యాలయం భక్త కన్నప్ప కంటి ఆసుపత్రిలో డిశంబరు నెలలో ఓ.పి విభాగంలో **546** మందికి కంటి పరీక్షలు, చికిత్సలు జరిగినవి. **19** మందికి కంటి పొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చబడినవి. **నలుగురికి** యాగ్ లేజర్ చికిత్సలు జరిగినవి.